కొనసాగిన కార్మికుల సమ్మె

ఆచంట: మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం కార్మికుల సమ్మె ఐదోరోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. వరి పరిశోధనా స్థానంలో పంటలు ఎండిపోతున్నా పట్టించుకోని పరిస్థితి దారుణమన్నారు. బుధవారం వంటావార్పు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు పడాల నాగలక్ష్మి, దమ్ము నూకరత్నం, కట్టా శ్రీలక్ష్మి, బొంతు నాగలక్ష్మి, తమనంపూడి సూర్యకుమారి, నాగరాజు జగదీష్ సుధాకర్, కిరణ్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న కార్మికులు

పిఎం విశ్వకర్మలో 'పశ్చిమ'దే అగ్రస్థానం

కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి - నరసాపురం

పిఎం విశ్వకర్మ రిజిస్ట్రేషన్లలో జాతీయస్థాయిలో ఎపి ముందంజలో ఉంటే, రాష్ట్రంలో పశ్చిమగోదావరి జిల్లా అగ్రస్థానంలో ఉందని కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. చేతి వృత్తిదారులకు ఆర్థిక భవిష్యత్తు కల్పించాలన్నదే పిఎం విశ్వకర్మ యోజన లక్ష్యమని తెలిపారు. మండలంలో తన దత్తత గ్రామమైన పిఎం లంక (పెదమైనవానిలంక)లో ఆమె మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పిఎం విశ్వకర్మ యోజన సమావేశంలో మాట్లాడుతూ చేతి వృత్తిదారులు వేరే పనికి వెళ్లలేరని, వారు పేదలకు, మధ్యతరగతికి మధ్య ఉన్నారన్నారు. శిక్షణ, టూల్‌కిట్‌తోపాటు ఆర్థికంగా సొంతంగా ఎదిగేందుకు బ్యాంకు రుణ సదుపాయాన్ని కూడా తక్కువ వడ్డీతో ఏర్పాటు చేశామన్నారు. మారుమూల ప్రాంతంలో డిజిటల్ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై చాలామంది సందేహపడ్డారని, నేడు అది పరిపూర్ణంగా కొనసాగుతూ ఎంతోమందికి నైపుణ్య శిక్షణ అందిస్తోందని అన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందారన్నారు. ఈ నైపుణ్య కేంద్రం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో శిక్షణ ఇవ్వడంలో భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి జిల్లాలో నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పి యువతీ, యువకులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో నౌకలు, పడవలు తదితర వాటి తయారీ, మరమ్మతుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడగా ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఎస్.రావత్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఆర్థిక శాఖ కార్యదర్శి కెవిఎస్.సత్యనారాయణ, భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, జిల్లా నైపుణ్య శిక్షణ అధికారి కృష్ణారెడ్డి, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, గ్రామ సర్పంచి కొల్లాటి కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులు పోతాబత్తుల పెంటయ్య, కోపనాతి మహాలక్ష్మయ్య తమ జీతాలు పెంచాలని, పెండింగ్ జీతాలు వచ్చేలా చూడాలని మంత్రిని కోరారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు.

పెనుగొండ: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయాన్ని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం సందర్శించారు. కేజీన్నర బంగారంతో తయారు చేయించిన బంగారు కిరీటం అమ్మవారికి అలంకరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆలయం వద్ద ఆమెకు కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, మాజీ మంత్రి శ్రీ చెరుకువాడ రంగనాథరాజు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, ఆలయ పాలకవర్గ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



సమస్యలు వినిపిస్తున్న గ్రామ సర్పంచి కొల్లాటి కనకదుర్గ

ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

బకాయిలు చెల్లించకపోతే మెరుపు సమ్మె

జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్

ఏలూరులో ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించకపోతే మెరుపు సమ్మెకూ వెనుకాడబోమని, అవసరమైతే ఎన్నికల విధులు కూడా బహిష్కరిస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్థిక బకాయిల సాధన కోసం జెఎసి దశలవారీ ఆందోళనలో భాగంగా మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉద్యోగులు ఫైర్‌స్టేషన్ సెంటర్, డిఇఒ కార్యాలయం, జిల్లా గ్రంథాలయం మీదుగా కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జెఎసి రాష్ట్ర కార్యదర్శి డి.వేణుమాధవ్ మాట్లాడుతూ ఆర్థిక బకాయిల సాధన కోసం, ఇతర డిమాండ్ల కోసం ఇప్పటికే ప్రభుత్వంతో అనేకసార్లు చర్చించామని, ప్రతిసారీ ప్రభుత్వం ఉద్యోగులకు మొండిచెయ్యి చూపించిందని, గత్యంతరం లేనిపరిస్థితుల్లో ఉద్యోగులు రోడ్డుపైకి రావాల్సి వచ్చిందని అన్నారు. ఈ నెల 27న జరిగే చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జెఎసి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతినెలా జీతంలో 20 శాతం జిపిఎఫ్, ఎపిజిఎల్ఐ రూపంలో ఉద్యోగులు ప్రభుత్వం దగ్గర దాచుకుంటున్నారని, ఉద్యోగులు దాచుకున్న సొమ్ము కూడా ఉద్యోగులకు ఇవ్వడానికి ఈ ప్రభుత్వానికి చేతులు రావడం లేదని అన్నారు. 12వ పిఆర్‌సికి సంబంధించి మధ్యంతర భృతి ఇవ్వాలని అడుగుతుంటే నేరుగా పిఆర్‌సి ఇస్తామని ప్రభుత్వం చెబుతుందని, నేరుగా పిఆర్‌సి ఇచ్చిన దాఖలాలు ఇప్పటి వరకూ లేవని తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సాయి శ్రీనివాస్, రుద్రాక్షి రవికుమార్, శ్రీధర్‌రాజు, కప్పల సత్యనారాయణ, సునీత, మల్లిక, సత్యభారతి పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ పట్ల యంత్రాంగం అప్రమత్తం

ప్రజాశక్తి - తణుకు

జిల్లాలో బర్డ్‌ఫ్లూ పట్ల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని, జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ ఆనవాళ్లు లేవని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక నెక్ కార్యాలయంలో జిల్లా పౌల్ట్రీ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో ఎటువంటి అసాధారణ మరణాలూ కోళ్లలో లేవన్నారు. అయినా అప్రమత్తత అవసరమన్నారు. రాపిడ్ యాక్షన్ బృందాలు ఏర్పాటు చేశామని, బయో సెక్యూరిటీ విధానాలను కచ్చితంగా అమలు చేసి పరికరాలను డిసిఇన్ఫెక్టంట్‌తో శుభ్రపర్చాలన్నారు. దానాల్లో ఇమ్యూనిటీ పెంచే విటమిన్ సి సెలీనియం వంటి మందులు వాడాలని సూచించారు. ప్రజలు వదంతులు నమ్మవద్దని, కోడిమాంసం, గుడ్లు అందరూ వినియోగించుకోవచ్చునని తెలిపారు. కోళ్లలో అసాధారణ మరణాలు సంభవిస్తే వెంటనే స్థానిక పశు వైద్యులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నెక్ ఛైర్మన్ గుణితి గంగాధర్‌రావు, ఎపి పౌల్ట్రీ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ కోమటిపల్లి వెంకట సుబ్బారావు, ఎపి సెక్రటరీ దొరయ్య, పౌల్ట్రీ రైతులు, తాడేపల్లిగూడెం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌కె.సుధాకర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.నరసింహారావు, పశు వైద్య శాఖాధికారి డాక్టర్ కె.శంకర్ భవనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కె.మురళీకృష్ణ

జిల్లా కలెక్టర్‌గానూ నరసాపురంలోనే తొలి అడుగులు

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లా కలెక్టర్‌గా నియమితులైన సుమిత్‌కుమార్ గాంధీ మంగళవారం ఉదయం తొలుత స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన నేపథ్యంలో ఆయన భీమవరంలో బాధ్యతలు స్వీకరించకుండానే నేరుగా నరసాపురం చేరుకున్నారు. ఆయనకు భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. సుమిత్‌కుమార్ గతంలో నరసాపురం సబ్ కలెక్టర్‌గా పని చేసిన నేపథ్యంలో అక్కడున్న సిబ్బంది ఒకొక్కరిని ఆయన పలుకరించారు. రికార్డు రూమును పరిశీలించి పాత జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు.

తెలుగు మాస్టర్ సీతారామాంజనేయమూర్తికి కలెక్టర్ పలకరింపు

సుమిత్‌కుమార్ నరసాపురం సబ్‌కలెక్టర్‌గా పని చేసిన కాలంలో తెలుగు నేర్పించిన మాస్టర్ ఎ.సీతారామాంజనేయమూర్తి (రాంబాబు) సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ సందర్భంలో కలెక్టర్ ఒక మాస్టర్ వద్ద విద్యార్థిలా వినయ విధేయతలు ప్రదర్శించడం అందరినీ విస్మయపర్చింది. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి రామకృష్ణ, తహశీల్దార్ ఎన్ఎస్ఎస్.ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జరిమానాల.. జమానా..!

- ఆటో, క్యాబ్‌లపై రవాణా, పోలీస్ శాఖ తీరు దారుణం
- లోపాల పుట్టగా ఏలూరు పాత బస్టాండ్ సిగ్నల్ పాయింట్
- స్టాప్‌లైన్, జీబ్రాలైన్ ఏర్పాటులో నిబంధనలకు తిలోదకాలు
- సెన్సార్ కెమెరాలతో ప్రతిరోజూ భారీగా జరిమానాలు
- ఆటో, క్యాబ్‌లపై రూ.ఐదు వేల నుంచి రూ. పది వేలు వడ్డన
- ఒక్క ఏలూరులోనే 4, 5 నెలల్లో దాదాపు రూ.ఐదు కోట్ల జరిమానాలు
- ఆటో, క్యాబ్‌డ్రైవర్ల గోడు పట్టించుకోని రవాణా, పోలీస్ శాఖల అధికారులు

ఆటో నడిపితే తప్ప కడుపు నిండని కుటుంబాలు వారివి. వచ్చే కొద్దిపాటి సొమ్ముతోనే ఇల్లంతా ఆధారపడి జీవనం సాగించాల్సిన పరిస్థితి. అలాంటి ఆటో, క్యాబ్ డ్రైవర్ల పట్ల రవాణా, పోలీస్ శాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఆయా కుటుంబాలను చిదిమేసే పరిస్థితి నెలకొంది. ఏలూరులో ఆటో, క్యాబ్ డ్రైవర్ల నుంచి జరిమానాల పేరుతో జరుగుతున్న దోపిడీ చూస్తే ఔరా అనక తప్పదు. పాత బస్టాండ్ సిగ్నల్ పాయింట్ వద్ద నిబంధనలకు తిలోదకాలిచ్చి ప్రతినెలా సెన్సార్ కెమెరాలతో రూ.వేలల్లో జరిమానాలు విధిస్తూ ఆటో, క్యాబ్ డ్రైవర్ల పట్ల అత్యంత ఘోరంగా వ్యవహరించడంతో మాకు న్యాయం చేయండి మహాప్రభో అంటూ రోడ్డెక్కాల్సిన దుస్థితి నెలకొంది. పోలీస్, రవాణాశాఖ అధికారులు బాధ్యత తమది కాదంటే తమది కాదంటూ ఒకరిపై ఒకరు నెట్టుకుంటూ వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏలూరు పాత బస్టాండ్ వద్ద స్టాప్ లైన్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు నగరంలో ఆరు వేల ఆటోలు, నాలుగు వేల క్యాబ్‌లు మొత్తం పది వేల వాహనాలు ఉన్నాయి. ప్రతిరోజూ నిత్యం వేలాది మంది ప్రయాణికులు ఈ వాహనాల్లో ప్రయాణిస్తుంటారు. రోజంతా కష్టపడినా ఆటోవాలాలకు వచ్చే సొమ్ము ఖర్చులు పోను రూ.500 నుంచి రూ.600 మాత్రమే. ఈ సొమ్ముతో కుటుంబమంతా జీవించాలి. పిల్లల చదువులు, ఆసుపత్రి ఖర్చులు అన్నింటికీ ఈ సొమ్మే ఆధారం. ఆటోవాలాలకు వచ్చే ఈ కొద్దిపాటి సొమ్మును కూడా వారికి దక్కకుండా చేస్తున్న పరిస్థితి ఉంది. రవాణా, పోలీస్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏలూరులోని ఆటో, క్యాబ్ డ్రైవర్ల కుటుంబాల పరిస్థితి దారుణంగా మారింది. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని సిగ్నల్ పాయింట్ వద్ద ఆటో, క్యాబ్ డ్రైవర్లపై కొనసాగుతున్న జరిమానాల జమానా చూస్తే ఎవరైనా నోరెళ్లబెట్టాల్సిందే. నిబంధనల ప్రకారం స్టాప్‌లైన్, జీబ్రాలైన్‌కు మధ్య అడుగుదూరం మాత్రమే ఉండాలని ఆటో, క్యాబ్ డ్రైవర్లు చెబుతున్నారు. ఈ సిగ్నల్ పాయింట్ వద్ద 15 అడుగుల దూరం పెట్టారు. దీంతో స్టాప్‌లైన్ దాటిన ప్రతి ఆటో, క్యాబ్‌పై సెన్సార్ కెమెరాలతో జరిమానాలు విధిస్తున్నారు. ఆటోకు రూ300, క్యాబ్‌కు రూ.వెయ్యి చొప్పున జరిమానా పడుతోంది. ఒక రోజులో రెండు, మూడుసార్లు ఈ జరిమానాలు పడిపోతున్నాయి. గడిచిన మూడు నెలల్లో ఒక్క ఆటోపై రూ.ఆరు వేల వరకూ జరిమానా పడిందంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. నిబంధన ప్రకారం రోడ్డు ఎత్తుపల్లంగా ఉన్నచోట సిగ్నల్ పాయింట్ పెట్టకూడదు. ఇక్కడ ఎత్తుపల్లంగా ఉన్నచోట సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేయడంతో జీబ్రాలైన్, స్టాప్‌లైన్ మధ్య భారీగా దూరం ఏర్పడినట్లు తెలుస్తోంది. ఇది ఆటో, క్యాబ్ వాలాలకు పెనుశాపంగా మారింది. పక్కకు వెళ్లేందుకు ఫ్రీ లైన్ సైతం ఏర్పాటు చేయని పరిస్థితి ఉంది. గతంలో ఈ చలానాలకు సంబంధించిన సొమ్మును పోలీస్ శాఖ ఖాతాలకు చేరేది. దీనిపై ఇటీవల అవకతవకలు బయటపడటంతో రవాణాశాఖ ఖాతాకు అనుసంధానం చేశారు. దీంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు రోడ్డు ట్యాక్స్ కట్టేందుకు, బ్రేక్ చేయించుకునేందుకు రవాణా శాఖ కార్యాలయానికి వెళ్తే పెండింగ్ జరిమానాలు కడితేనే సంబంధిత సైట్ తెరుచుకుంటుంది. దీంతో ఒక్కసారిగా రూ.వేలల్లో జరిమానాలు చెల్లించలేక ఆటో, క్యాబ్ డ్రైవర్లు అప్పుల పాలవుతున్నారు. ఒక్కో ఆటో, క్యాబ్‌పై సరాసరిన రూ.ఐదు వేల చొప్పున లెక్కించినా గడిచిన నాలుగైదు నెలల్లో ఒక్క ఏలూరులోనే ఆటో, క్యాబ్‌లపై దాదాపు రూ.ఐదు కోట్లకుపైగా జరిమానా విధించిన పరిస్థితి ఉంది. రవాణాశాఖ, పోలీస్ అధికారులు సమిష్టిగా ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. దీంతో ఇప్పటికే ఆందోళనలు, ర్యాలీలు నిర్వహించిన ఆటో, క్యాబ్‌వాలాలు తమ సమస్య పరిష్కారం కోసం ఈ నెల 22, 23 తేదీల్లో రిలే నిరాహార దీక్షలకు సిద్ధమవుతున్నారు. స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోని పరిస్థితి. రెక్కాడితేగాని డొక్కాడని ఆటో, క్యాబ్ డ్రైవర్లపై అధికారులు ఎందుకు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. పెండింగ్ ఈ చలానాలను రద్దు చేయాలని, స్టాప్‌లైన్, సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించాలని, అప్పటి వరకూ తాత్కాలికంగా సిగ్నల్స్ నిలుపుదల చేయాలని ఆటో, క్యాబ్ డ్రైవర్లు కోరుతున్నారు. ఈ సమస్యపై ఏలూరు ఆర్‌టిఒ కె.శ్రీహరిని వివరణ కోరగా ఇది రవాణాశాఖకు సంబంధించింది కాదని, పోలీస్‌శాఖ పరిధిలోకి వస్తుందన్నారు. జిల్లా పోలీస్‌శాఖ అధికారులు, రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సి ఉందని, స్థానికంగా పరిష్కారం అయ్యే సమస్య కాదని స్పష్టం చేశారు.

సిగ్నల్ పాయింట్ సమస్య పరిష్కరించాలి

జె.గోపీ, ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి

ఏలూరు పాతబస్టాండ్ సమీపంలోని సిగ్నల్ పాయింట్ వద్ద జీబ్రాలైన్, స్టాప్‌లైన్ మధ్య 15 మీటర్ల దూరం పెట్టారు. ఫ్రీలైన్ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో సెన్సార్ కెమెరాలతో భారీగా ఆటో, క్యాబ్‌లకు రూ.వేలల్లో జరిమానా విధిస్తున్నారు. ఇది దారుణం. వెంటనే జరిమానాలను రద్దు చేయాలి. తాత్కాలికంగా సిగ్నల్ నిలుపుదల చేయడంతోపాటు సమస్యను వెంటనే పరిష్కరించాలి. లేకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.

ఒపిఎస్ అమలుపై స్పష్టమైన హామీ ఇవ్వాలి

యుటిఎఫ్ ఆధ్వర్యాన ఎంపిపికి వినతి

ప్రజాశక్తి - యలమంచిలి

ఓట్ ఫర్ ఒపిఎస్ ఉద్యమ కార్యాచరణలో భాగంగా యుటిఎఫ్ నేతలు ఒపిఎస్ అమలుపై స్పష్టమైన హామీ కోరుతూ ఎంపిపి రావూరి వెంకటరమణ, ఇతర రాజకీయ పార్టీల ప్రతినిధులకు మంగళవారం వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా ఒపిఎస్ అమలుపై మేనిఫెస్టోలో స్పష్టంగా ప్రకటించాలన్నారు. దీనిపై సిఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై ఎంపిపి మాట్లాడుతూ ఈ అంశాన్ని పార్టీ నేతలు, సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పోలిశెట్టి క్రాంతికుమార్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, దొమ్మేటి చంద్రశేఖరరావు, నేతలు దండు పద్మావతి, ముద్దల బాపిరాజు, బి.విజయ పద్మ, అడబాల వెంకటేశ్వరరావు, కౌరు శ్రీనివాసరావు, ముద్దల శ్రీరామాంజనేయరావు, ఐవి.గోపాలరాజు, వలవల యజ్ఞప్రసాద్, వలవల మురళీధర్, వాసంశెట్టి ఫణికుమారి, గుణ్ణం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నేతపై దాడి..!

రాజకీయ కోణంలో అనుమానాలు?

ప్రజాశక్తి - ఉండి

ఐటిడిపి జిల్లా అధ్యక్షుడు యశోదకృష్ణయ్యపై సోమవారం రాత్రి గుర్తు తెలియని దాడికి పాల్పడ్డాడు. అయితే కృష్ణయ్య ప్రతిఘటించడం, కేకలు వేయడంతో నిందితుడు పరారయ్యాడు. ఉండి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలిగొట్లకు చెందిన టిడిపి నేత యశోద కష్ణయ్య కిరాణా వ్యాపారం చేస్తున్నాడు. యశోద కృష్ణయ్య కుటుంబీకులు 15 రోజుల క్రితం తీర్థయాత్ర నిమిత్తం కాశీ వెళ్లడంతో కృష్ణయ్య ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తి కృష్ణయ్య ఇంట్లోకి ప్రవేశించాడు. వెనుక నుంచి కృష్ణయ్యకు ముసుగు వేసి గొంతు నొక్కడానికి ప్రయత్నించాడు. దీన్ని కృష్ణయ్య ప్రతిఘటించి ఆగంతుకుని చేతిని కరవడం ఆగంతకుడు పీక వదలగానే కృష్ణయ్య గట్టిగా కేకలు వేశాడు. దీంతో స్థానికులు అక్కడకు రావడంతో ఆగంతకుడు వెనుక వైపు నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఇంట్లో వెతకగా ఆగంతకుడు తనతో తీసుకువచ్చిన ఒక చాకు మాత్రమే దొరికిందని, యశోద కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఉండి ఎస్ఐ మందపల్లి లక్ష్మణ్ తెలిపారు. దీనిపై ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ తమ నేతపై దాడికి పాల్పడింది వైసిపి నేతలా, లేక దొంగతనానికి వచ్చి హత్యా ప్రయత్నం చేశాడా అనే విషయాలను పోలీసులు వెంటనే తేల్చాలని, ఆగంతకుడిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఆసుపత్రిలో అందుబాటులో అన్ని సేవలు

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ఇకపై అన్ని వైద్య సేవలూ నరసాపురం ఏరియా ఆస్పత్రిలోనే అందుబాటులో ఉంటాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి.ప్రసాదరాజు అన్నారు. నరసాపురం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో డాక్టర్ ఆర్.సుప్రియ అధ్యక్షతన అభివృద్ధి సలహా సంఘం సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి ముదునూరి.ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆసుపత్రి పనితీరు, పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా వైద్యులకు, సిబ్బందికి ఆయన పలు సూచనలు చేసి మాట్లాడారు. 50 పడకలుగా ఉన్న ఏరియా ఆసుపత్రిని 100 పడకలుగా అభివృద్ధి చేశామని తెలిపారు. వైద్యులను పూర్తిస్థాయిలో భర్తీ చేశామన్నారు. దానికి అనుగుణంగా ప్రజలకు వైద్య సేవల్లో ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని ఆయన సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన బ్లాక్‌లో గైనకాలజీ విభాగానికి సంబంధించిన రెండు ఆపరేషన్ థియేటర్లను ఆయన ప్రారంభించారు. ఇక్కడ గైనాకాలజీ, ఆర్థోపెటిక్ విభాగాలకు సంబంధించిన ఆపరేషన్లు జరుగుతాయన్నారు. గుండె నొప్పికి ప్రాథమికంగా చేయాల్సిన రూ.20 వేల ఖరీదైన ఇంజక్షన్ నరసాపురం ఏరియా ఆసుపత్రిలో అందుబాటులో ఉంచామని, ఆ ఇంజక్షన్‌ను ఉచితంగా చేస్తారని తెలిపారు. ఈ ఆసుపత్రిలో త్వరలో డయాలసిస్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి డాక్టర్ ఆర్.సుప్రియ, ఆస్పత్రి కమిటీ సభ్యులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, కౌన్సిలర్ జిల్లెల్ల దిలీప్ పాల్గొన్నారు.



ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

కళ్యాణమస్తు, షాదీ తోఫా నిధుల జమ

411 మందికి రూ.2.84 కోట్ల లబ్ధి

ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వైఎస్ ఆర్ కళ్యాణమస్తు, వైఎస్ఆర్ షాదీ తోఫా పథకంలో భాగంగా వివాహం చేసుకున్న అర్హులైన 411 మంది లబ్ధిదారులకు రూ.2.84 కోట్లు లబ్ధి చేకూరినట్లు ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ అన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం వైఎస్ఆర్ కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకానికి సంబంధించి వివాహం చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి డి.పుష్ప రాణి, బీసీ సంక్షేమ శాఖ అధికారి జి.గణపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి రూ.2.84 కోట్ల నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మాన్యువల్ చెక్కు అందజేస్తున్న ఎంఎల్‌సి రవీంద్రనాథ్

గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజాశక్తి వార్తకు అధికారుల నుంచి స్పందన లభించింది. ఈనెల 12వ తేదీన గుర్రపు డెక్క తొలగించండి మహా ప్రభో..! శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి మంగళవారం లక్ష్మణేశ్వరం వంతెన వద్ద కాలువలో తూడు, చెత్తను జెసిబితో గుర్రపు డెక్కను తొలగించారు.

వాలంటీర్లు సేవా సారథులు

ప్రజాశక్తి - కాళ్ల

కరోనా వంటి విపత్కర పరిస్థితులు, వర్షాలు, వరదలు ఎలాంటి పరిస్థితుల్లోనైనా ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసిన వాలంటీర్లు సేవ సారథులని ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు కొనియాడారు. మంగళవారం కాళ్లలో బాలికల హాస్టల్ వద్ద, పెదఅమిరంలో వాలంటీర్ల అభినందన సభ నిర్వహించారు. ఈ సభలకు ఎంపిపి శిరీష విశ్వనాథరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాలంటీర్లను సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులతో సత్కరించారు. అనంతరం ఎంపిపి మాట్లాడుతూ వాలంటీర్లు ఇదేవిధంగా తమ సేవ కార్యక్రమాలను కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, సర్పంచ్ వబిలిశెట్టి జిల్లా ఆధ్యక్షులు కొలుకులూరి ధర్మరాజు, మండల కో ఆప్షన్ సభ్యులు గుర్రం జార్జి బెనహర్, పెదఅమిరం గ్రామ సర్పంచి దొక్కు సోమేశ్వరరావు, పలు గ్రామాల ఎంపిటిసిలు పాల్గొన్నారు.

సొసైటీ ఆధ్వర్యాన మెడికల్ షాపు ఏర్పాటు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో మొయ్యేరు సొసైటీ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన మెడికల్ షాపును సోమవారం రాత్రి ఉంగుటూరు ఎంఎల్ఎ వాసుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావాల్సిన ఎరువులు, రుణాలను అందించడమే కాకుండా ప్రజల ఆరోగ్య రక్షణకు కావాల్సిన మెడికల్ షాపును ఏర్పాటు చేయడం హర్షించ దగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు ఈదర.ఆశోకచక్రవర్తి, కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ సర్పంచి దూళ్ల కుటుంబరావు పాల్గొన్నారు.

అప్పనపేటలో పొలంబడి

ప్రజాశక్తి - గణపవరం

అప్పనపేటలో జరిగిన పొలంబడి కార్యక్రమంలో 15048 రకం వరి వంగడంపై రైతులకు ఉండి కెవికె సైంటిస్ట్ మల్లికార్జునరావు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రస్తుతం వరి సాగులో ఆర్‌ఎన్ఆర్ 15048 రకం సాగు చేస్తే 125 రోజుల్లో పంట చేతికొస్తుందన్నారు. ఎకరానికి 35 నుంచి 38 బస్తాలు దిగుబడి వస్తుందని చెప్పారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో గణపవరం వ్యవసాయాధికారి వై.ప్రసాద్, రైతులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

సర్వేశ్వరస్వామి దేవస్థాన కమిటీ నియామకం

ప్రజాశక్తి - ఆచంట

కొడమంచిలి సర్వేశ్వరస్వామి దేవస్థానం నూతన కమిటీని నియమించినట్లు సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. దేవస్థానం ఛైర్మన్‌గా శెనం రామకృష్ణ, సభ్యులుగా కొల్లేపర వెంకన్నబాబు, నార్గన ఆదినారాయణ, మన్నె లక్ష్మి, పితాని సత్యవతి, మావూరి కుసుమ-కొండేటి వెంకాయమ్మ ఎక్స్‌అఫీషియో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులను తూర్పుపాలెం క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రంగనాథరాజు మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సుంకర సీతారామ్ మాట్లాడుతూ కొడమంచిలిలో ఇప్పటివరకు కాపులకు ఛైర్మన్ పదవి దక్కలేదని, ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు సహకారంతో కాపులకు అవకాశం దక్కడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులతోపాటు, నాయకులు పితాని గణపతి, కొండేటి వరప్రసాద్, దండు సత్యనారాయణ రాజు, పోలిశెట్టి వనమూరావు పాల్గొన్నారు.

29తో పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లకు గడువు పూర్తి

జిల్లా ఖజానా అధికారి అడారి గణేష్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లు (పెన్షనర్స్ వార్షిక వెరిఫికేషన్ సర్టిఫికెట్లు) అందించేందుకు ఈ నెల 29వ తేదీతో గడువు పూర్తవుతుందని జిల్లా ఖజానా, లెక్కల శాఖ అధికారి అడారి గణేష్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఒక్క పెన్షనర్ తమ దగ్గరలోని ఉప ఖజానా కార్యాలయంలో గాని, ఆన్‌లైన్‌లోగాని, స్థానిక పోస్ట్ ఆఫీసుల్లో గాని దగ్గరలో ఉన్న నెట్ సెంటర్‌లో గాని లైఫ్ సర్టిఫికెట్ వేయించుకున్నారని తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించడానికి ఉప ఖజానా కార్యాలయాలకు వచ్చే పెన్షనర్లకు ఇబ్బంది కలగకుండా స్థానిక ఖజానా కార్యాలయాల్లో అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఫ్యామిలీ పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్లతోపాటు నాన్ ఎంప్లాయిమెంట్ సర్టిఫికెట్లు, నాన్ రీ మ్యారేజ్ సర్టిఫికెట్లు సమర్పించాలని కోరారు. పెన్షనర్స్ ఈ సదుపాయాలను వినియోగించుకొని సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలని తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండి

అప్పుల భారంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వాండ్రం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రామిశెట్టి కిరణ్ కుమార్ అప్పుల భారంతో ఈ నెల 15వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు సాయంతో భార్య దివ్య అతనిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం కిరణ్ కుమార్ మంగళవారం మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ మండలపల్లి లక్ష్మణ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో గేదె సజీవ దహనం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

దిగమర్రు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున పశువుల పాకలో జరిగిన అగ్ని ప్రమాదంలో గేదె సజీవ దహనమైంది. రెండు గేదెల పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బోనగిరి ఏడుకొండలు, అన్న కుమారుడు బోనగిరి వెంకటేష్‌కు చెందిన రెండు పశువుల పాకల్లో 3 గేదెలు, ఒక ఆవు, రెండు దూడలను కట్టారు. అయితే మంగళవారం తెల్లవారుజామున పాకలకు నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో ఆవు, దూడలు, ఆవు బయటపడ్డాయి. గేదె సజీవ దహనమైంది. మరో రెండు గేదెలు తీవ్ర గాయాలతో ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. వైసిపి పాలకొల్లు ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు, గోపి సంఘటన స్థలానికి వెళ్లి బాధితులను పరామర్శించి రూ.20,000 సొంత సొమ్ము అందజేశారు. బాధితులను సర్పంచి గుమ్మాపు పెద్దిరాజు, ఎఎంసి వైస్ ఛైర్మన్ డిడిటిసి బాబు, మండల కన్వీనర్ పెద్దపాటి ప్రభాకర్ పరామర్శించారు. పాలకొల్లు టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు పరామర్శించారు. బాధితులకు టిడిపి తరపున రూ.50 వేలు అందజేశారు.

వెంకన్న ఆలయం కిటకిట

ప్రజాశక్తి - ఆచంట

ఏకాదశి సందర్భంగా ఆచంటలో వెంకటేశ్వర స్వామి ఆలయం మంగళవారం యాత్రికులతో కిటకిట లాడింది. పరిసర ప్రాంతాల నుంచి యాత్రికులు స్వామివారిని పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను పల్లకిపై వూరేగించారు. ఈ సందర్భంగా సాయంత్రం స్వామివారిని రథోత్సవంపై ఆచంట పురవీధుల గుండా బాణాసంచా, భాజా భజంత్రీలతో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు పెచ్చెట్టి సత్యనారాయణ, కువ్వు కిరణ్, వేమన అప్పారావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి రామచంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఆచంటలో స్వామి వారి రథయాత్ర

ప్రజాశక్తి ప్రతి ఇంటా - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ బాబు

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ముఖ్యమంత్రి దేశంలో జగన్మోహన్ రెడ్డి ఒక్కరే అని రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, తణుకు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మంతెన యోగీంద్ర కుమార్ (బాబు) అన్నారు. మంగళవారం కోరుకొల్లు సర్దార్ దండు నారాయణరాజు ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ షుగరు, బిపి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏమైనా ఇబ్బందులున్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయితే వైద్యులు వైద్యం అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. దీర్ఘకాలిక రోగాలైతే కార్పొరేట్ హాస్పిటల్లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు పెద్ద ఎత్తున ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు రోగ నిర్ధారణ చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా క్షత్రియ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.సుబ్బరాజు, గ్లోబల్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎన్.వెంకటరామరాజు, కలిదిండి నాగవర్మ, పి.సూర్యనారాయణ రాజు, మైప సర్పంచి గొట్టుముక్కల జయంతి తిరుపతిరాజు, తంగేళ్ల ఆనంద్, యండగండి పిహెచ్‌సి వైద్య అధికారి డాక్టర్ బెన్నీ సామ్యూల్, ఎంపిడిఒ అనూహ్య, తహశీల్దార్ కె.నాగార్జున, భీమవరం అవినాష్ హాస్పిటల్ వైద్యులు డి.రజిత రంగనాయిక, భీమవరం ఏరియా ఆసుపత్రి జనరల్ సర్జన్ శ్రీనివాస్, విష్ణు డెంటల్ వైద్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యోగీంద్ర కుమార్

వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యం

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - ఉండి

వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. మంగళవారం యండగండిలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో రెండో రోజు నిర్వహించిన ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో పాల్గొన్న మంతెన రామరాజు మాట్లాడారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పిన ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకూ చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. పేదవాడి సొంతింటి కలను నెరవేరుస్తానని ఇచ్చిన హామీ ఎంతవరకూ నెరవేరిందని ఆయన ప్రశ్నించారు. అనంతరం ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు మంతెన రవి వర్మ (వేణు), తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు, మండల ప్రధాన కార్యదర్శి కిన్నెర వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

తణుకు: వైసిపి ప్రభుత్వ అరాచకాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం కెఎస్.గట్టు గ్రామం నుంచి రాధాకృష్ణ భవిష్యత్తు కోసం సకలజనుల చైతన్య పాదయాత్ర చేపట్టారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సీతారామలక్ష్మి మాట్లాడుతూ గతంలో రాధాకృష్ణ ఎంఎల్ఎగా ఉన్నప్పుడు గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అసమర్థ అవినీతి పరిపాలనకు చరమగీతం పాడే దిశగా అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు పాదయాత్ర చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ దొమ్మేటి వెంకట సుధాకర్, జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, మహిళా కార్యదర్శి తమరపు రమణమ్మ పాల్గొన్నారు.



ఉండి : ప్రజలతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

ఎస్‌టియు రాష్ట్ర అసోసియేట్ సహాధ్యక్షులుగా రామచంద్రరావు

ప్రజాశక్తి - భీమవరం

ఎస్‌టియు రాష్ట్ర అసోసియేషన్ సహాధ్యక్షులుగా కెవి.రామచంద్రరావు, ఉపాధ్యక్షులుగా డి.దావీదు ఎన్నికయ్యారు. భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద రెండు రోజులు పాటు జరిగిన ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక జరిగింది. దీనిలో భాగంగా రాష్ట్ర నూతన కార్యవర్గంలో జిల్లాకు చెందిన విస్సాకోడేరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న రామచంద్రరావుకు, ఆరవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న దావీదుకు చోటు లభించింది. ఈ మేరకు ఎస్‌టి రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. అసోసియేట్ సహాధ్యక్షులుగా ఎన్నికైన రామచంద్రరావును, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన దావీదును పలువురు అభినందించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కెవి.రామచంద్రరావు

డి.దావీదు

ఇకెవైసిని పరిశీలిస్తున్న ఎడిఎ పార్వతి

23లోపు ఇ-పంట నమోదు చేసుకోవాలి

ఆచంట: ఈ నెల 23వ తేదీలోపు ఇ-పంట నమోదు పూర్తి చేయాలని పాలకొల్లు సహాయ వ్యవసాయ సంచాలకులు అడ్డాల పార్వతి అన్నారు. మంగళవారం మండలంలో ఆచంట, ఆచంట వేమవరం, పెనుమంచిలి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆచంట వేమవరంలో ఇ-పంట నమోదును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దాళ్వాలో ఇ-పంట నమోదులో భాగంగా రైతులు రైతు భరోసా కేంద్రాలకొచ్చి వేలిముద్రలు గాని, ఒటిపి గాని చెప్పి నమోదు చేసుకోవాలని తెలిపారు. ఇ-పంట నమోదును ఈనెల 23వ తేదీలోపు రైతులు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు, రైతు భరోసా కేంద్రాల ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపర్చడం అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం వాసవీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిర్వహించే జాతీయ సేవా పథకం శిబిరాన్ని కడియద్ద గ్రామంలో మంగళవారం ఉదయం కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రాంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కడియద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు ఈ శిబిరాన్ని నిర్వహించిన మొదటి రోజు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించడమే కాకుండా గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించి చైతన్య పర్చడం అభినందనీయమన్నారు. శ్రీవాసవీ కళాశాల విద్యార్థులు గ్రామ సచివాలయం పరిసరాల్లో చెత్తాచెదారాలను ఏరివేసి శుభ్రపరిచి గ్రామ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులతోపాటు ప్రోగ్రాం ఆఫీసర్లు ఎన్.రాజశేఖర్, ఆర్ఎల్.లోకేష్ బాబు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మూర్తి పాల్గొన్నారు.

జగనన్న సురక్షను వినియోగించుకోవాలి

మొగల్తూరు : గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు దినేష్ కుమార్ సూచించారు. మంగళవారం మోడీ గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలను పరీక్షించారు. ఈ శిబిరంలో డాక్టర్ దినేష్ కుమార్, (జనరల్ వైద్యులు) డాక్టర్ జెఇఎస్ గణేష్‌బాబు (చిన్న పిల్లల వైద్యులు) డాక్టర్ విజయశాంతి (జనరల్ వైద్యురాలు), డాక్టర్ టి.వాసు (కంటి వైద్య నిపుణులు) రోగులను పరీక్షించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. వారిలో 94 మందికి కళ్లజోళ్లు అవసరమని, ఇద్దరికి శాస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించినట్లు డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారెళ్ల మాధవి, ఎంపిటిసి సభ్యురాలు తిరుమాని వరలక్ష్మి పాల్గొన్నారు.

గణపవరం ఎంపిడిఒగా ప్రభాకరరావు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం నూతన ఎంపిడిఒగా ఎంఎస్ ప్రభాకరరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభాకరరావు కాళ్ల మండలం నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన జి.జ్యోతిర్మయి రాజానగరం బదిలీ అయ్యారు. ఇప్పటివరకూ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పివి సత్యనారాయణ రిలీవయ్యారు. ఈ సందర్భంగా ప్రభాకరరావుకు ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

వివక్ష లేకుండా అందరికీ సమన్యాయం

ప్రజాశక్తి - నరసాపురం

సమాజంలో ఎటువంటి వివక్ష లేకుండా న్యాయం అందరికీ సమానంగా అందాలనీ, ఎవరికైనా ఉచితంగా న్యాయ సహాయం అవసరమైతే మండల న్యాయ సేవా సంస్థను, ఉచిత న్యాయవాదులను సంప్రదించాలని నరసాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సంస్థ సభ్యులు చల్లా దానయ్య నాయుడు అన్నారు. మంగళవారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా సరిపల్లె గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు దానయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఉచిత న్యాయవాదులు కె.పద్మజ, నక్కా ఆనందబాబు, సచివాలయం కన్వీనర్లు కె.శోభనరావు, వి.ఏసురత్నం, విఆర్ఒ రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సహకారం అభినందనీయం

ప్రజాశక్తి - ఆకివీడు

కొల్లేటి విద్యార్థులకు సహకారం అందజేయడం అభినందనీయమని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని పెదకాపవరం జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ పుచ్చకాయల రాజేశ్వరమ్మ, శేషమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఛైర్మన్ న్యాయవాది పుచ్చకాయల బ్రహ్మాజీ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్మలాకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ట్రస్ట్ ఛైర్మన్ బ్రహ్మాజీరావు మాట్లాడుతూ కొల్లేటి తీరంలో ఉన్న తమ గ్రామంలోని హైస్కూల్‌కు ఎంతో దూరం నుంచి ఎంతోమంది విద్యార్థులు కొల్లేరు ప్రాంతం నుంచి నడిచొస్తున్నారన్నారు. వారిని చూసి సైకిల్ ఇవ్వాలనిపించి పంపిణీ చేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో గణపవరం డిగ్రీ కళాశాల బోటనీ లెక్చరర్ సిహెచ్ చైతన్య, తెలుగు లెక్చరర్ జి.వెంకటరమణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బందెల కాళహస్తీశ్వరుడు, గ్రామ సర్పంచి పూసల బేబీ స్నేతు మాట్లాడారు.

కొత్తపల్లి రోడ్డు నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - గణపవరం

కొత్తపల్లి రోడ్డును వెంటనే నిర్మించాలని సిపిఎం జిల్లా నాయకులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి, నాయకులు ఎం.పెంటారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్తపల్లి రోడ్డు గోతులు పడి అధ్వానంగా తయారైందని తెలిపారు. ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణం వరదాజపురం నుంచి కొత్తపల్లి వెళ్లే వరకూ రోడ్డును నిర్మించాలని, లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఉమాబాల గెలుపునకు కృషి చేస్తాం

పాలకోడేరు సర్పంచులు, ఎంపిటిసిలు హామీ

ప్రజాశక్తి - భీమవరం

నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని పాలకోడేరు మండల సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హామీ ఇచ్చారు. భీమవరంలోని పార్టీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి ఉమాబాలను సర్పంచులు ఎంపిటిసిలు, నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బిసి అభ్యర్థికి నరసాపురం ఎంపీ స్థానాన్ని కేటాయించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేసి ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమాబాల గెలుపునకు అన్ని వర్గాలనూ కలుపుకొని శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఆమెను కలిసిన వారిలో విస్సాకోడేరు, పాలకోడేరు, వేంద్ర, పెన్నాడ, కొండేపూడి సర్పంచులు బొల్లా శ్రీనివాస్, ఇంజేటి మరియమ్మ, కడలి నాగేశ్వరి, చిల్లా అనూష, చింతపల్లి చిన్న, ఎంపిటిసిలు బొల్లం గాంధీ, పాల జ్యోతి, ఆదాడ లక్ష్మీ తులసి పాల్గొన్నారు.

'అభివృద్ధి కొనసాగాలంటే జగన్ మళ్లీ సిఎం కావాలి'

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ తిరిగి సిఎం కావాలని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి చెప్పారు. పట్టణంలోని రామారావుపేటలో మంగళవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను కలిసి తాగునీరు, డ్రెయినేజీ తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని 99 శాతం అమలు చేశారన్నారు. ఆయన వెంట వైసిపి నేతలు చెల్లెం ఆనందప్రకాష్, సత్తిబాబు, జోగి వెంకటేశ్వరరావు, చినమిల్లి గణపతి, జోగాడ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నాగబుజ్జి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆదర్శ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా రొక్కాల నాగ బుజ్జి చేస్తున్న సేవలు అభినందనీయమని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ తనయుడు వైసిపి యువ నేత కొట్టు విశాల్ అన్నారు. మంగళవారం ఆదర్శ్ సంస్థ ప్రెసిడెంట్ రొక్కాల నాగ బుజ్జి అధ్యక్షతన తాడేపల్లిగూడెంలో నూతన కార్యాలయాన్ని కొట్టు విశాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా అందరికీ మంచి చేయడం సంతోషంగా ఉందన్నారు. తాడేపల్లిగూడెం వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, ఐజెయు జాతీయ కార్యదర్శి డి.సోమ సుందర్ మాట్లాడారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు, ఎంపిటిసి పొట్ల ఏడుకొండలు, గూడెం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రంగ సురేష్, సీనియర్ జర్నలిస్టులు షేక్ ఖాదర్ పాల్గొన్నారు.

ముత్యాలపల్లిలో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని 39 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం భారీ అన్న సమారాధన చేశారు. అభయ ఆంజనేయస్వామి ఆలయం ఐదో వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

యాత్రికులకు పులిహోర పంపిణీ

నరసాపురం: టిడిపి ఆధ్వర్యంలో అంతర్వేది యాత్రి కులకు పంటు రేవు వద్ద పులిహోర పంపిణీ చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, సీనియర్ నాయకులు కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు యాత్రికులకు పులిహోర పంపిణీ కార్యక్రమాన్ని ప్రారభించారు. ఈ కార్యక్రమంలో జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, కటకంశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు. అలాగే జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో యాత్రికులకు పులిహోర పంపిణీ చేశారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - ఆకివీడు

రానున్న వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపిపి జయలక్ష్మి సూచించారు. మంగళవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి విజయలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ త్వరలో ఎన్నికల రానున్నాయని, ఎన్నికల కోడ్ ఏ విధమైన సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు సమావేశాలకు హాజరయ్యేలా చూస్తామని ఆమె సభ్యులకు హామీ ఇచ్చారు. తహశీల్దార్ వెంకటేశ్వరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సభలో ఎండిఒ యద్దనపూడి రామకృష్ణ, అధికారులు మాట్లాడారు.

CHANGE OF NAME

I, **KOLLABATHULA VENKATA OMESWARA RAO** S/o. Kollabathula Ranga Rao, D.No.15-3-97/1, Palaparthivari Street, NTR Colony, Narasapur-534275, W.G.Dt. A.P. I have changed my name from **KOLLABATHULA KARUNAKAR** (Old name) to **KOLLABATHULA VENKATA OMESWARA RAO** (New name) hence forth I am being called **KOLLABATHULA VENKATA OMESWARA RAO** S/o. Kollabathula Ranga Rao, for all purposes.

CHANGE OF NAME

I, **THUMMA VIJAYA BHASKARA RAO** S/o. Thumma Venkanna (Late), D.No. 17-1-102A, Kothapalli vari Street, Rustumbada, Narsapur, Narsapur Mandal, W.G.Dt. A.P. I have changed my name from **TUMMA VIJAYA BHASKARA RAO** (Old name) to **THUMMA VIJAYA BHASKARA RAO** (New name) hence forth I am being called **THUMMA VIJAYA BHASKARA RAO** S/o. Thumma Venkanna (Late), for all purposes.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 297/General/2023-24, Dated. 17-02-2024

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Supply and Delivery of LED Drivers, Strips with related accessories for the repairs of Street Lights of Eluru Municipal Corporation Limits."** Total No. of works is **1** with an amount of Rs. **9.57** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 21-02-2024. Last date of receipt of tenders is 27-02-2024. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone/ Fax: 08812-245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU